ప్రజాజ్యోతి

# వరంగల్

ములుగు,మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ

శుక్రవారం 13-2-2026 పేజీలు : 11

వరంగల్, ఫిబ్రవరి 12 : గెలుపు కోసం పడిన కష్టాలు... ఓటరు నాడి పట్టుకోవడానికి, అభ్యర్థుల ఎంపికకు చేసిన సర్వేలు... సొంత పార్టీ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా రంగంలో దిగిన రెబల్ అభ్యర్థులు.. నాయకులు, బరిలో నువ్వా.. నేనా..? అన్నట్లుగా ఓటు కోసం లక్షలు రూపాయల ఖర్చు.. వీటిలో ఏవి ఫలితాన్ని ఇస్తాయో... ఏ కారణాలు నిండా ముంచనున్నాయో తేలాల్సి ఉంది. ఏ సర్వేలు నిజం కాబోతున్నాయో విజయానికి ఏలాంటి అంశాలు ప్రభావితం చేశాయి. ఓటరన్న ఎవరికి జై కొట్టారు అనేది శుక్రవారం ఉదయం కొద్దిగంటల్లోనే తెలిపోతుంది. ప్రతి టేబుల్ వద్ద లెక్కింపునకు నలుగురు సిబ్బంది చొప్పున 250 మందిని నియమించారు. లెక్కింపుపై శిక్షణ కూడా అందించారు. రెండు రౌండ్లలోనే ఓట్ల లెక్కింపు పూర్తి చేయనున్నారు. మొదటి రౌండ్ వెయ్యి ఓట్లతో పూర్తి చేస్తారు. రెండో రౌండ్ మిగిలిన ఓట్లను లెక్కిస్తారు. ముందుగా బూత్‌లవారీగా ఓట్లను లెక్కిస్తారు. అన్నీ కట్టలు ఒక చోటకు చేర్చి గుర్తుల వారీగా విడదీస్తారు. 8 గంటలకు లెక్కింపు ప్రారంభించి 11 గంటలలోపే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టారు.



# గెలుపెవరిదో?



## భారత్ బంద్‌లో కాంగ్రెస్ ధర్నా

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను నిరసిస్తూ భారత్ బంద్‌లో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు, మేయర్ గుండు సుధారాణి తదితరులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెల్లి ధర్నా చేపట్టారు. నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల రద్దు, ప్రైవేటీకరణ నిలిపివేత, కనీస వేతనం 26,000 అమలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి డిమాండ్లు ఉంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థులు ఏజెంట్లు నిర్ణిత సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి

**- మాజీ ఎమ్మెల్యే పెద్ది**

8 లో..



# 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి 29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలి

**- స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు 26 వేలు చెల్లించాలి**

**- కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ థర్డ్ పార్టీ విధానం రద్దుచేసి పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతి రేక విధానాలపై ఏఐటియుసి సిఐటియు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సిఐటియు ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మికవర్గానికి ఉపయోగపడే 29 కార్మిక చట్టాలను కేంద్రం లోని మతోన్మాద బిజెపి ఫాసిస్టు ప్రభుత్వం ఆ కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పోరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉండేవిధంగా నాలుగు లేబర్ కోడ్స్ గా కుదించడం జరిగిందని,దాని వల్ల కార్మిక వర్గం రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడుతున్న దృష్ట్యా కనీస వేతనాలు అడిగే పరిస్థితి,ఉద్యోగ భద్రత,సమ్మె చేసే హక్కు ఉండదని ఆరోపించారు. లేబర్ కోడ్స్ అన్నింటిని వెంటనే రద్దుచేసి 29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని, సెంట్రలైజ్ కిచెన్ విధానం రద్దు చేయాలని,భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. సివిల్ సప్లైస్ హమాలీ కార్మిక వర్గాన్ని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని,అసంఘటిత రంగ కార్మిక సంఘాలైన హమాలి తదితర గ్రామీణ కార్మికులను సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఇవన్నీ అమలు జరిగే వరకు సమరశీల ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి అంజద్ భాష,తెలంగాణ రైతు కూలీ సంఘం ములుగు జిల్లా కార్యదర్శి పల్లెబోయిన స్వామి,అధ్యక్షుడు బానోత్ నర్సింహ,న్యూ డెమోక్రసీ నాయకులు బొమ్మిడి సాంబయ్య,ఏఐటియుసి నాయకులు మొలుగూరి రాంబాబు,ముత్యాల రాజు, కొక్కుల రాజేందర్,దేవేందర్, పోరెడ్డి ప్రమీల,కమలక్క, భారతి,సరోజన,రాజకుమారి, కుమారి,కొక్కుల రాజేందర్ దేవేందర్,ఐలయ్య,శ్యాం సుందర్,బుడిమె సదయ్య మంకిడి కృష్ణ,ఆశావర్కర్లు, మున్సిపల్ కార్మికులు, జయాకర్,సుదర్శన్,సిఐటియు నాయకులు మహేష్, ప్రవీణ్,రవి,తదితరులు పాల్గొన్నారు,

# నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి



**హసన్‌పర్తి,ఫిబ్రవరి-12(ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక నియమావళులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నియమావళుల వల్ల దేశంలోని సంస్థలకు యజమానులకు మేలు చేకూరి, కార్మికులు, చిన్న ఉద్యోగస్తులు నష్టపోతారని నాయకులు ఆరోపించారు.నూతన నియమావళుల అమలుతో ఎనిమిది గంటల పనిదినం రద్దై, యాజమాన్యాల ఇష్టానుసారం పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగిస్తూ పాత నలభై నాలుగు కార్మిక చట్టాలను అమలు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్, మాజీ మండల పరిషత్ సభ్యుడు కలవచర్ల సుదర్శన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు మోతె లింగారెడ్డి, అఖిల భారత కార్మిక సంఘం నాయకులు రేణుకుంట్ల దుర్గప్రసాద్, రేణుకుంట్ల రాజయ్య, వెలిశోజు రమణాచారి, వీరబోయిన తిరుపతి, గార్ల తదితరులు నాయకత్వం వహించారు.ధర్నాలో బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు బొర్ర సురేష్, మంద క్రాంతి, ఎల్‌పీసీ కార్మిక సంఘం అధ్యక్షుడు సీతంపేట తిరుపతి, ఎల్‌పీసీ సంస్థ కార్మికులు ఎర్ర సురేందర్, రేణుకుంట్ల తిరుపతి, ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు కూడా హాజరయ్యారు.

# కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** బుధవారం రోజున జరిగిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నేడు జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లో కౌంటింగ్ నిర్వహిస్తుండడంతో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం శుక్రవారం ఉదయం 6 గంటల నుండి మరుసటి రోజు అనగా 14 తారీఖు ఉదయం 6 గంటల వరకు అమలులో వుంటుందని. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.




# కార్మిక హక్కుల హరణపై ఆగ్రహం

**-విద్యుత్ బిల్లు ఉపసంహరణకు డిమాండ్**

**- వీబీ జీ రామ్ జీ చట్టం రద్దు చేయాలంటూ నినాదాలు**

**హసన్‌పర్తి,ఫిబ్రవరి-12(ప్రజాజ్యోతి):** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా ఏఐఏడబ్ల్యూయు జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఐటీయూ మండల కన్వీనర్ పుల్ల అశోక్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే విత్తన బిల్లు ముసాయిదాను, విద్యుత్ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం రూపొందించిన నాలుగు కార్మిక నియమావళులు కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నాయని, అవి అమల్లోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఐదు సార్లు భారీ సమ్మెలు నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సేవలను ప్రైవేటీకరణ పేరుతో పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని, దీని వల్ల స్వదేశీ పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య, ఆరోగ్య రంగాల వ్యాపారీకరణతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సహజ వనరులను కొద్దిమంది ధనిక వర్గాలకు కట్టబెట్టేందుకు చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారని విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయు జిల్లా కమిటీ సభ్యురాలు వేలు రజిత, మంద సుచందర్, సీఐటీయూ మండల కమిటీ సభ్యులు ఉడుత శ్రీవాణి, మాలోతు లలిత, బొమ్మగాని వనజ, ఆనందం, ప్రమీల, రాజేశ్వరి, పుష్ప, వెంకట్ లక్ష్మి, పూల, రాణి, పద్మవతి, చందన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో గురువారం రోజున రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో 30 మంది టిబి (క్షయ) వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లను రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ "ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్" లో భాగంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున 30 మంది టిబి బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు (పౌష్టికాహార పదార్థాలు, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు) దాతలు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వాసవి ఫెర్టిలిటీ హాస్పిటల్: డా. రాకేష్ వాసవి రెడ్డి, వంగ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ : డా. వంగ హేమంత్ రెడ్డి సహకారంతో జులై నెల నుండి ఆరు నెలల పాటు ప్రతి నెలా 30 మందికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ ఇప్పటివరకు 6 నెలలు పూర్తి అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, టిబి బాధితులు, టిబి విభాగం సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ సత్య శారద**



**నర్సంపేట ఫిబ్రవరి12 (ప్రజా జ్యోతి):** నర్సంపేట ఈ నెల 13వ తేదీననిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా,పారదర్శకంగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన నర్సంపేట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు, అభ్యర్థుల గ్యాలరీలు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లు,సీసీ కెమెరా పర్యవేక్షణ వంటి అంశాలను కలెక్టర్ సమీక్షించారు.కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు,వారి ఏజెంట్లు మీడియా ప్రతినిధులకు అవసరమైన కల్పించబడిన మౌలిక సదుపాయాలు పరిశీలించారు. అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని,మొత్తం 6 రౌండ్లలో, 10 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి,ఆర్డీఓ ఉమారాణి, మునిసిపల్ కమిషనర్ భాస్కర్, తహశీల్దార్ రవిచంద్రరెడ్డి,సిఐ సాయన్న,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జనగామ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి) :** జనగాం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ గురువారం పరిశీలించారు. జనగాం పట్టణంలోని ఏకశిలా బి.ఎడ్. కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లో ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు, టేబుల్ అమరికలు, సీసీటీవీ పర్యవేక్షణ, భద్రతా చర్యలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, త్రాగునీరు--శౌచాలయ సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక వసతులపై విపులంగా పరిశీలించి, కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల నియమావళి ప్రకారం పారదర్శకంగా, ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికలలో అత్యంత కీలక దశ. ప్రతి అంశంలో భద్రతా



ప్రమాణాలు పాటిస్తూ, పారదర్శకత, సమయపాలనతో కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ జనగాం, మున్సిపల్ కమిషనర్, జనగాం, డిఈ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ నగర్ కాలనీలో ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

**రూ. 30,000 వేల రూపాయలు విరాళం ప్రకటించిన సర్పంచ్ కంది శ్వేత కృష్ణచైతన్య రెడ్డి.**



**చెన్నారావుపేట ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో బొడ్రాయి వార్షిక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లూ బంధుమిత్రులు, చిన్నారుల సందడితో కళకళలాడింది ఈ వేడుకలకు గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బొడ్రాయి వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులందరికీ సుఖసంతోషాలు కలగాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఉత్సవ నిర్వహణ ఏర్పాట్ల కోసం తన వంతు సహాయంగా రూ. 30,000/- వేల రూపాయల నగదును విరాళంగా ప్రకటించి కమిటీ సభ్యులకు అందజేశారు. బొడ్రాయి ఏర్పాటు సందర్భంగా గ్రామంలో ఉన్న కాలనీవాసులతో చుట్టాలతో చిన్నపిల్లల సందడితో రాజీవ్ నగర్ కాలనీలో పండగ వాతావరణం నెలకొంది.

# పకడ్బందీగా కౌంటింగ్ నిర్వహణ

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**




**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి) :** జనగాం, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లకు సంబందించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియకి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. నేడు జరగనున్న మున్సిపల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పైన సంబంధిత అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గురువారం గూగుల్ మీటింగ్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు ( శుక్రవారం) ఉదయం 8 గంటలకు ప్రారంభం అయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నియమావళి ప్రకారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించాలన్నారు. లెక్కింపు ప్రక్రియలో ప్రతి దశను స్పష్టంగా అమలు చేసే విధంగా అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద మూడు స్థాయిలలో భద్రతా ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో మొత్తం ప్రక్రియ కొనసాగుతుందని, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లకు గుర్తింపు కార్డుల ఆధారంగా ప్రవేశం కల్పించేలా చూడాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే తెరవాలన్నారు. లెక్కింపు ప్రక్రియలో మొదటగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లను లెక్కింపు ఉంటుందని, చెల్లుబాటు అయ్యే ఓట్లను , చెల్లని ఓట్లను వేరుచేయాలని, అన్ని నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం మాత్రమే పోస్టల్ ఓట్లను లెక్కలో చేర్చాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అనంతరం పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన బ్యాలెట్ బాక్స్‌లను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచి లెక్కింపు ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసేలా అధికారులు వారి విధులను సక్రమంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ వీసీలో ఆర్డీవో లు, మాస్టర్ ట్రైనర్లు, ఆర్వోలు, ఏఆర్వో లు, కౌంటింగ్ సూపర్‌వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో క్రీడారంగానికి పెద్ద పీట

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి12:** సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో క్రీడా రంగానికి పెద్ద పీట వేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం చెల్పూరు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా రంగానికి ప్రజాపాలన ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు విద్యార్థులు, క్రీడాకారులు ఈ పోటీల్లో తమ ప్రతిభలను కనపరిచి రాణిస్తే జాతీయ, రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపుతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకువెళ్ళాలన్నారు.



# అంగన్‌వాడీ టీచర్ మెడలోనీ నాలుగు తులాల పుస్తెల తాడు అపహరణ

**చెన్నారావుపేట ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఒక అంగన్‌వాడీ టీచర్‌పై దాడి చేసి, ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును దుండగుడు లాక్కెళ్లిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... మండల కేంద్రంలోని కందిగడ్డ తండాకు చెందిన గుగులోతు సుజాత (39) కందిగడ్డ తండాలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం కాజీపేటలో నివసిస్తున్నారు.గురువారం ఉదయం తన విధులకు వెళ్లడానికి ఆమె కాజీపేటలో బస్సు ఎక్కి, సూరిపెల్లి గూడూరు క్రాస్ రోడ్డు వద్ద దిగారు. అక్కడ ఆటో కోసం వేచి చూస్తుండగా, నెక్కొండ వైపు నుండి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికాడు.అతని మాటలు నమ్మిన సుజాత మోటార్ సైకిల్ ఎక్కారు. కందిగడ్డ తండా శివార్లలోని దుర్గమ్మ ఆలయం వద్ద ఆమె దిగి నడుచుకుంటూ వెళ్తుండగా, సదరు వ్యక్తి ఆమెను వెంబడించి ఒక్కసారిగా వెనుక నుండి కిందకు తోసేశాడు. ఆమె తేరుకునే లోపే మెడలో ఉన్న దాదాపు




నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా తెంచుకుని తన మోటార్ సైకిల్‌పై అక్కడి నుండి పరారయ్యాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలిపారు.

# స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన

**అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి) :** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ గురువారం సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. స్టేషన్ ఘనపూర్ లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కౌంటింగ్ హాల్స్ నిర్మాణం, టేబుల్ ప్లానింగ్, అభ్యర్థులు ఏజెంట్ల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, బ్యారికేడింగ్, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల నిర్వహణ, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా



అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ఎన్నికలలో అత్యంత కీలక దశ కావున భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ, పారదర్శకతతో కౌంటింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, స్టేషన్ ఘనపూర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మికుల ధర్నా




**ఖానాపురం/ఫిబ్రవరి 12(ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం ఖానాపురం మండల కేంద్రంలో రైతు కూలి, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముఖ్య సమ్మయ్య, సిఐటియు జిల్లా నాయకుడు కామ్రేడ్ రాంచందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. దేశంలో స్వాతంత్రానికి పూర్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి నేడు దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టామన్నారు. గత 11 సంవత్సరాల నుంచి దేశాన్ని పాలిస్తున్న మోడీ ప్రభుత్వం, ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులను మెప్పించడానికి కార్మిక చట్టాలను ఖూనీ చేయాలని చూస్తే, మరింత ప్రజా ఆగ్రహం చవిచూస్తారన్నారు. వెంటనే కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడు అందె విజయ్, ప్రధాన కార్యదర్శి గుగులోత్ బిక్షపతి, ప్రచార కార్యదర్శి వీరన్న, సిఐటియు మండల మహిళా అధ్యక్షురాలు కోడూరు వెంకటమ్మ, సభ్యులు సాంబన్న, వీరస్వామి, సరిత, పార్వతి, ప్రసన్న, మోహన్, వీరన్న, కనకయ్య తదితరులున్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం

**మహాముత్తారం,ఫిబ్రవరి 12.ప్రజాజ్యోతి :** మండలంలోని యామనపల్లి గ్రామపంచాయతీకి చేందిన దుర్గం చిన్న సారయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏడవ వార్డ్ మెంబర్ లక్ష్మణస్వామి గురువారం దుర్గం బ్రదర్స్ తో కలిసి ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక సహాయానికి సహకరించినవారిలో దుర్గం చినయ్య రమేష్ రాజబాపు రత్నం విజయమూర్తి దుర్గం రమేష్ ప్రవీణ్ లక్ష్మన్ చంద్రమొగిలి రాజమల్లు మల్లేష్ బౌత్ గణేష్ సందీప్ నరేష్ లడ్డు రాజశేఖర్ ధనుష్ రాజబాపు దేవర వినయ్ లు ఉన్నారు.



# రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు సిద్ధం

**ప్రత్యేక పూజలు పార్వతీ పరమేశ్వర కళ్యాణం ప్రధాన ఆకర్షణ**

**నల్లబెల్లి, ఫిబ్రవరి 12(ప్రజా జ్యోతి):** నల్లబెల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఉత్సవాల నిర్వహణపై కమిటీ అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మకర్త తాటిపెల్లి రవీందర్ ఆలయం, పరిసర ప్రాంతాల్లో అలంకరణ, దీపాలంకరణ, సౌండ్ వ్యవస్థల ఏర్పాట్లు భక్తుల సహకారంతో వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 15న ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, నిత్యార్చనలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు రుద్రహోమం జరుగుతుంది. రాత్రి 8.30 గంటలకు పార్వతీ పరమేశ్వర కళ్యాణం నిర్వహించనుండగా, ఇది భక్తులకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ వేళ బిల్వార్చన, సుగంధ పుష్పార్చన, మహా హారతి అనంతరం పంచామృత తీర్థ ప్రసాదం పంపిణీ చేస్తారు. మహాశివరాత్రి మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని కమిటీ కోరింది. సమావేశంలో కోశాధికారి మార్కండేయ, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పురాం భద్రీనాథ్, అర్చకులు పెందుట మురళీమోహనాచార్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ిం




# కోటగుళ్లు శివరాత్రి మహోత్సవాలకు కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి12:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 15న మహా శివరాత్రి మహోత్సవాలకు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ లను కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆహ్వాన పత్రిక అందజేసారు. అదేవిధంగా ఐ బి ఈ ఈ బసవ ప్రసాద్ గౌడ్ భూపాలపల్లి డి.ఎస్.పి అవిరి నేని సంపత్ రావు, చిట్యాల సిఐ మల్లేష్ భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు.



# వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి): విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు మరియు తల్లిదండ్రులు అధ్యాపకుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పి టి ఎం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు మరియు సీనియర్ స్టాఫ్ సభ్యులు పాల్గొని విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. ఈసీఈ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ వి. సుధీర్ రాజా సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి దిశగా చర్చించారు. విద్యార్థుల హాజరు శాతం, అంతర్గత పరీక్షల మార్కులు, ప్రాజెక్ట్ పనుల ప్రగతి, సాంకేతిక నైపుణ్యాలు, అకడమిక్ పనితీరు వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరంగా తెలియజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వ్యక్తిగత మరియు విద్యా సంబంధిత సమస్యలను కూడా తల్లిదండ్రులతో చర్చించి, వాటికి సరైన పరిష్కార మార్గాలను సూచించారు. అధ్యాపకులు తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థులలో క్రమశిక్షణ, సమయపాలన, సాంకేతిక పరిజ్ఞానం మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి అవసరాన్ని వివరించారు. ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచడానికి నిర్వహిస్తున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెషన్స్ మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు




భవిష్యత్‌లో మంచి కెరీర్ సాధించేందుకు తల్లిదండ్రులు మరియు అధ్యాపకులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఈ సమావేశం ద్వారా తల్లిదండ్రులు మరియు అధ్యాపకుల మధ్య పరస్పర అవగాహన పెరిగి, విద్యార్థుల విద్యా ప్రగతికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల బలహీనతలను గుర్తించి వాటిని మెరుగుపరచేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేసి, కాలేజ్ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే. ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. తిరుపతి రావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వి. సుధీర్ రాజా, కోఆర్డినేటర్లు రణధీర్, సబిత, డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- చట్టాలను రక్షించుకుందాం, హక్కులను కాపాడుకుందాం
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు నష్టపోతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ అన్నారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను రక్షించుకుందామని, హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను టీడబ్ల్యూజేఎఫ్ వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్న మోడీ సర్కారు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసేవరకు జాతీయ కార్మిక సంఘాలతో ఐక్యంగా పోరాటం కొనసాగుతుందన్నారు. రద్దయిన 29 చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి రెండు చట్టాలు కూడా




ఉన్నాయని తెలిపారు. జర్నలిస్టుల కనీస వేతనాలకు సంబంధించి గురుబక్ష్ మజీథియా వేజ్ బోర్డు సిఫారసులను కేంద్రం అమలుచేయడం లేదని ఆరోపించారు. ఉన్న చట్టాన్ని కోడ్ లుగా మార్చి పాత్రికేయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు అనంతుల రమేష్, జిల్లా కోశాధికారి గాయపు రాజు రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈర్ల సురేందర్, మచ్చిక వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రాల శ్రీనివాస్, బందారి బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి, ఫిబ్రవరి 12(ప్రజా జ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో రూ.2.46 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సబ్‌స్టేషన్ ప్రారంభంతో కొండాపురం, అసరవెల్లి, మురళీనగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వోల్టేజ్



సమస్యలు తగ్గి, నిరంతర విద్యుత్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, నర్సంపేట విద్యుత్ డీఈఈ తిరుపతి, కన్స్ట్రక్షన్ డీఈఈ హర్షి, నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి. కొండాపురం సర్పంచ్ లలిత సురేష్, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో రామప్ప దేవాలయాన్ని సుందరీకరించాలి

- మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర

వెంకటాపూర్/ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి): రామప్పశ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా రామప్ప దేవాలయాన్ని సుందరీకరించాలని,భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప శ్రీరామ లింగేశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)సిహెచ్ మహేందర్ జీ,ఆర్డీఓ వెంకటేష్ ఆలయ ఈఓ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

కార్మిక సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు

చెన్నారావుపేట ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి): చెన్నారావుపేట మండల కేంద్రంలో దేశవ్యాప్త సమ్మె రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల పిలుపులో రైతు, కార్మిక సంఘాల నాయకులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వ హించి, అనంతరం కార్మిక సంఘాల కోఆర్డినేటర్ పరికి మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సివిల్ సప్లై హమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింహ్మ స్వామి, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ మొగులోజు శారద మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికుల పట్ల కపట ప్రేమ నటిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని వారు అన్నారు, పోరాడి సాధించుకున్న అనేక లేబర్ కోడ్ చట్టాలను, నాలుగు లేబర్ చట్టాలుగా వ్యవహరిస్తుందని వారు అన్నారు, తక్షణమే నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, వ్యవసాయ రంగంలో నూతన ఆర్థిక విధానాలు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు, నూతనంగా విత్తన, విద్యుత్, మార్కెట్ చట్టాలను ఉపసంహరించుకోవాలని వారి డిమాండ్ చేశారు, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పద్ధతి మార్చుకపోతే ఐక్య కార్యచరణతో ప్రభుత్వానికి గద్దదిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పత్తి అనంతరెడ్డి, సిపిఎం నాయకులు మొగిలి జనార్ధన్ రెడ్డి,అంగన్వాడి యూనియన్ నాయకులు అల్వాల కళ్యాణి, ఘర్నాపల్లి రాజు, మార్గం రాజ్కుమార్,కోరె కార్తిక్, హనుమాన్లు ఉపేందర్, బాపట్ల వీరేశం,పులి రవీందర్, సరోజన, పిట్టల సుధాకర్, నూకల లక్ష్మి, విజయ, రాధిక, పూలమ్మ, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ, హమాలి సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాలే మార్గం

**వెంకటాపురం,ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి) :** కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు కార్మిక వర్గానికి పోరాటాలే మార్గమని ములుగు జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి బి రెడ్డి సాంబశివ పిలుపునిచ్చారు.గురువార దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వెంకటాపురం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు శివాలయం నుండి బస్టాండ్,అంబేద్కర్ సెంటర్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బి రెడ్డి సాంబశివ మాట్లాడుతూ..2014లో కేంద్రంలో బిజెపి అధికారం వచ్చాక భారత కార్మిక వర్గం చేస్తున్న ఎనిమిదవదేశవ్యాప్తసమ్మెఇదిఅన్నారు.కార్మికులు,కష్టజీవులు,వ్యవసాయ కార్మికులు,రైతుల జీవన ఉపాధి మీద మునుపేన్నడు లేనంత తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.సంస్కరణ పేరిట మోడీ ప్రభుత్వం యదేచ్ఛంగా దోపిడీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.శతాబ్ద కాలం పాటు కార్మికులు సమరశీల పోరాటాలు అశేష త్యాగాలతో సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్ పేరిట కాలరాయాలని చూస్తున్నారని అన్నారు.సంఘం పెట్టుకునే హక్కును,8 గంటల పని విధానాన్ని రద్దు పరచాలని చూస్తున్నారని విమర్శించారు.మతతత్వ కార్పొరేట్ శక్తులు,కార్మిక వర్గాన్ని అస్తిత్వ రాజకీయాల పేరిట విడగొట్టి వాళ్లలో వాళ్లకు తగవులు పెట్టి దేశ సంపదలను,జాతి వనరులను అడ్డు అదుపు లేకుండా మోడీ ప్రభుత్వం కొల్లగొడుతుందని ఆరోపించారు.లేబర్ కోడులను వెంటనే రద్దు పరచాలని,గతంలో ఉన్న కార్మిక




చట్టాలను పునరుద్దించాలని ఆయన డిమాండ్ చేశారు.సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ..మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునర్దించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ నిరుద్యోగంపై చేస్తున్న పోరాటంగా ఈ సమ్మెను చూడాలని కోరారు.వివిధ ప్రభుత్వ విభాగాలలో,ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న లక్షలాది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తన బిల్లు,విద్యుత్ సంస్కరణ బిల్లు,రైతులకు ప్రజలందరికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కట్ల నరసింహాచారి,బిఎన్ కుమారి,రత్నకుమారి,ప్రేమ కుమారి,సడాలు,రంజిత్,జనగం శ్రీను,రాంప్రసాద్,సుధాకర్,అశోకు,ముదిబాక వీరబ్రహ్మం,నాగమణి,ఉషా,భాగ్య,ప్రభావతి,లక్ష్మి పోశాలు,సమ్మయ్య,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల మరణ శాసనంగా మారిన నాలుగు లేబర్ కోడ్స్

**లేబర్ కోడ్స్ ను విరమించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం పతనం తప్పదు**

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండి దావూద్**

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని. విద్యుత్ సవరణ 2025. విబి. జి. రామ్ జి చట్టం. ఉపసంహరించుకోవాలని తెలంగాణ కేంద్ర-రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కు ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండి దావూద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోవాలని. కార్మిక సంఘాలు. కార్మిక చట్టాలు లేని దేశంగా భారత్ ను కార్మికుల్ని దిక్కులేని వాళ్ళని చేసి పారిశ్రామికవేత్తలకు. పెట్టుబడిదారులకు బహుమానంగా ఇవ్వాలని పూనుకొని బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి 1926 ట్రేడ్ యూనియన్ చట్టాలను విరోచితంగా పోరాటం చేసి సాధించుకొని యూనియన్లు ఏర్పాటు చేసుకొని హక్కుల్ని సాధించుకుంటే రెండవసారి బిజెపి అధికారంలోకి వచ్చిన 2019. 2020. ఆరు సంవత్సరాల తర్వాత 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానం లో నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి ఇంతకాలం పోరాట ఫలితంగా నిలిపివేసి. లేబర్ కోడ్స్ సులభతరం చేసి కార్పొరేట్ సంస్థలకు ప్రజలను దోచుకోవడానికి తలుపులు బార్ల తెరిచారని కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అదేవిధంగా లేబర్ కోడ్స్ లు పూర్తిగాఅమల్లోకి వస్తే దేశంలో 40 కోట్ల సంఘటిత. అసంఘటిత కార్మికుల బ్రతుకులు మరణ శాసనంగా తయారవుతాయని పెట్టుబడిదారులకు సంపాదించుకోవడం సులభతరం అవుతుందన్నారు. అదే మారుగా ఈ లేబర్ కోడ్ లతో కార్మికులు. ఉద్యోగులు సంఘం పెట్టే హక్కు. సంఘటితమయ్యే హక్కు. నిరసనలు. సమ్మె చేసే హక్కులు కోల్పోతారు అన్నారు. ఉద్యోగ భద్రత పట్ల యాజమాన్యాలకు అన్ని బాధ్యతలనుండి తొలగిపోతారు.హైర్‌డఫైర్ పద్ధతిని తీసుకువచ్చి పర్మినెంట్ ఉద్యోగులకు కూడా ఎలాంటి హక్కులు లేకుండా చేసి విచ్చలవిడిగా కాంట్రాక్ట్ కార్మికులను నియమించుకోవడం చట్టపరం చేస్తూ. ఫిక్స్డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేస్తుంది. దీనివల్ల పెట్టుబడిదారులకు విచ్చలవిడిగా అనేక లాభాలు వచ్చేలా అవకాశం కలుగుతుంది. కార్మికులు సమ్మెలతో పాటు లేబర్ కోర్టు లకు వెళ్దామంటే లేబర్ కొట్టు రద్దుచేసి వాటి



స్థానంలో పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తారు. ఆట్రిబ్యునల్ ఇచ్చే తీర్పులు అమలు కాకుండా ఉండేందుకు అపరిమితమైన అధికారాలు ఆయా ప్రభుత్వాలకు కట్టబెడతారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేషనల్ ఫ్లోర్ లెవెల్ వేతనం రోజుకు 178/బిరూ; నెల వేతనం 4628/బిరూ; లకు తక్కువ కాకుండా ఏ రాష్ట్రంలో ఇవ్వకూడదంటున్నారు. ఒకవైపేమో కార్మికులు కనీస వేతనం 26 వేల రూపాయలు అడుగుతుంటే మరొకవైపు ప్రభుత్వం ఇలా అంటుంది. పని గంటలకు సంబంధించి అనేక పోరాటాలు మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి ఇప్పటికే కొన్ని పరిశ్రమల్లో.కొన్ని రాష్ట్రాల్లో అమలు పరుస్తున్నారన్నారు. లేబర్ కోడ్ అమలు వల్ల కార్మికులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని దేశ ప్రధాని స్థానంలో మోడీనే ఇన్ని అబద్ధపు ప్రచారాలు చేస్తే ఇంకా ఏమైనా ఉందా అని దావూద్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు.ఈ లేబర్ కోడ్ వల్ల అంగన్వాడి. ఆశ.మధ్యాహ్న భోజనం. ఐకెపి. ఆర్పి. ఉపాధి హామీ. నేషనల్ హెల్త్ మిషన్ లాంటి స్కీం లలో పని చేస్తున్న వారిని కనీసం కార్మికులుగా కూడా గుర్తించబడరని 4 లేబర్ కోడ్స్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్ లక్ష్మి నరసమ్మ, సభ్యురాలు వై లక్ష్మి,సెక్టార్ లీడర్ సిహెచ్ అరుణ, జె జ్యోతి. ఆశా వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గం సరిత, సభ్యులు రాజ్యలక్ష్మి, ఖాసింబి, నాగమణి, శారద, కాలిక, అరుణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి యాకూబ్, సభ్యులు ఎం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కల తొలగింపు

**- ప్రజాజ్యోతి కథనానికి స్పందించిన సర్పంచ్ చీదురు శంకర్**




24 Oct 2025 - Page 4

ఆ మూలమలుపులోనే దాగివుంది యమపాశం

- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు.. అధికారులు పట్టించుకోకపోతే ప్రజల బతుకులు ముక్కలు
- జాగ్రత్తగా వెళ్లకపోతే అక్కడితో నీఆయుష్ తీరినట్టే
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి

**పర్వతగిరి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** పర్వతగిరి మండల కేంద్రం నుంచి నెక్కొండ, నర్సంపేట మండలాలకు వెళ్లే రహదారిలో పోలుకమ్మ చెరువు కట్ట నుండి మొదలుకొని మూల మలుపుల వద్ద ఎర్రగుంట కట్టపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను స్థానిక సర్పంచ్ చీదురు శంకర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఇటీవల 'ఆ మూల మలుపులోనే దాగి ఉంది యమపాశం' అనే శీర్షికతో ప్రజా జ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి సంబంధించిన సర్పంచ్ మూల మలుపుల వద్ద ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా గ్రామం మీదుగా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ వయా మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి, కేసముద్రం మండలాలకు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది. వార్త కథనానికి సంబంధించిన పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్ కు ప్రయాణికులు, ఇస్లావత్ తండా గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మూల మలుపుల వద్ద జరుగుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చి వార్త కథనం ప్రచురించిన ప్రజా జ్యోతి దిన పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఖమ్మం పాటి సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించిన

**కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు**

**రాయపర్తి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం,బురహన్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఖమ్మంపాటి సోమ్మయ్య తండ్రి ఖమ్మం పాటి సత్తయ్య అనారోగ్యంతో గురువారం మరణించగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి,ప్రగాఢ సానుభూతి తెలియజేసినరాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్రెడ్డి.ఈకార్యక్రమంలోవర్ధన్నపేట ఏ ఎం సి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణా రేడ్డి,మహబూబ్నగర్ గ్రామ సర్పంచ్ పెండ్లి మహేందర్ రెడ్డి,మండల ముఖ్య నాయకులు టీఎం కృష్ణమాచార్యులు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్,బాలు నాయక్ తండా గ్రామ భూక్య సమ్మయ్య శ్రీదేవి,మండల యూత్ అధ్యక్షుడు కళ్యాణ్,మరియు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇంతలా వీరా రేడ్డి, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నల్ల మరమ్మతు పనులు నిర్వహించిన సర్పంచ్ సుదర్శన్ గౌడ్

**చెన్నారావుపేట ఫిబ్రవరి 12( ప్రజా జ్యోతి) :** చెన్నారావు పేట మండలం పాపయ్య పేట గ్రామం లో,నల్ల యొక్క మెయిన్ లైన్ పగలడం వల్ల, ఉదయం నుండి ఇప్పటి వరకు మరమ్మతు పనులు నిర్వహిస్తున్న సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ ఈ కార్యక్రమంలో ధర్మ తండా సర్పంచ్ రవి నాయక్, పాపయ్య పేట ఉప సర్పంచ్ లింగాల సారెంగం, వార్డు సభ్యులు, బండి చిన్ని రమేష్, మరియు గ్రామ సిబ్బంది జన్ను శ్రీను, ఐలయ్య, యాకయ్య,బొక్కల జాబిలి బోడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు



# ఏకాగ్రతే విద్యార్థులకు విజయ రహస్యం

### - మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ





పర్వతగిరి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):ప్రతి విద్యార్థికి ఏకాగ్రతే విజయ రహస్యమని మాజీ ఐపీఎస్ అధికారి సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. పర్వతగిరి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ వరంగల్ మరియు పర్వతగిరి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కొరకు చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడాలని ఏకాగ్రతతో చదివి పరీక్షలకు సిద్ధమై వాటిని ఆనందంగా ఎదుర్కోవాలని అన్నారు. పరీక్షలకు సంసిద్ధంగా లేని విద్యార్థి పరీక్షలంటే ఆందోళన చెందుతారని అన్నారు. ప్రతి విద్యార్థి నిత్యజీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ముందుగా క్రమశిక్షణను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల కొరకు రోటరీ క్లబ్ వారు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన వరంగల్ విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధులు అవ్వాలని వంద శాతం ఉత్తీర్ణతని సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశలోనే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. జీవితంలో కొన్ని రోజుల కష్టపడితే జీవితాంతం సుఖంగా ఉండవచ్చని అన్నారు. రోటరీ క్లబ్ వరంగల్ ప్రెసిడెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ పర్వతగిరి మండలంలో రోటరీ క్లబ్ విద్యార్థుల కొరకు చేస్తున్న కార్యక్రమాలను తెలిపారు. కార్యక్రమం అనంతరం జడ్.పి.హెచ్.ఎస్ పర్వతగిరి 21 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ వరంగల్ వారి సహకారం తో అందించిన సైకిళ్లను మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్, సంపాదకులుగా డాక్టర్ మడత భాస్కర్, మరియు పాఠశాల బృందం రూపొందించిన పాఠశాల మాస పత్రిక "అక్షర వాహిని" జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. పర్వతగిరి కస్తూర్బా పాఠశాల పూర్వ విద్యార్థిని ధరావత్ నికిత ఉన్నత చదువుల కొరకు రోటరీ క్లబ్ వరంగల్ వారిచే ఏర్పాటి చేసిన ఆర్థిక సహకారాన్ని జెడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా విద్యార్థినికి అందించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ బిక్షపతి వ్యవహరించగా కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ జి. ఎల్లరాజు, శ్రీకాంత్, డి. నరసింహారావు, రవీందర్, రాజయ్య, సుధాకర్,పర్వతగిరి మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనం ఆకస్మిక తనిఖీ

**పర్వతగిరి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):**పర్వతగిరి మండల కేంద్రంలో ఉన్నటువంటి 108అత్యవసర అంబులెన్సు ను బుధవారం జిల్లా ఈ ఎం ఈ గుర్రపు భరత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా



అయన వాహనం లో ఉన్నటు వంటి రిజిస్టర్లు మెడిసిన్, వివిధ పరికరాలు, ఆక్సిజన్ కి సంబందించిన అన్నిటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేసారు. కాల్ సెంటర్ నుండి వచ్చిన ప్రతి కాల్స్ కి సమాధానం ఇచ్చి, కేసు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి సకాలంలో చేరే విధంగా, విధులలో అప్రమత్తం గా ఉండాలని,జాగ్రత్తగా వాహనాన్ని నడపాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక అంబులెన్సు ఈ ఎం టీ శ్యామ్ సుందర్, పైలట్ రమేశ్ పాల్గొన్నారు.

# సమ్మక్క--సారలమ్మ మహా జాతర--2026లో మహిళా సంఘాలకు భారీ ఆదాయం

### -రూ. 6 కోట్ల పెట్టుబడి..రూ. 3 కోట్ల లాభం-అభినందించిన మంత్రి సీతక్క

### -ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి నిదర్శనం-మంత్రి సీతక్క

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** సమ్మక్క--సారలమ్మ మహా జాతర--2026 సందర్భంగా ములుగు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి .ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లు భారీ ఆదాయాన్ని ఆర్జించాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని 10 మండలాలను కవర్ చేస్తూ మొత్తం 565 ఆదాయ యూనిట్లను వాం+ ల ద్వారా ఏర్పాటు చేయగా వారు జాతర సమయంలో రూ.3 కోట్లకు పైగా ఆదాయాన్ని సంపాదించారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని మేడారం జాతర ప్రాంగణంలో మహిళా సంఘాలకు అనుకూలమైన ప్రదేశాల్లో షాపులను కేటాయింప చేశారు. ములుగు జిల్లాలోని పది మండలాలకు చెందిన మహిళా సమాఖ్యల ద్వారా వివిధ రకాల వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయించి మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించారు. మంత్రి సీతక్క స్వయంగా ఈ యునిట్లను ప్రారంభించి వారి బిజినెస్ కు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రభుత్వ ప్రోత్సాహకం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడంతో మహిళలు కూల్ డ్రింక్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, ఇప్పపువ్వ లడ్డూ స్టాళ్లు, బ్యాంబూ చికెన్, క్యాంటీన్లు, స్నాక్స్ తదితర దుకాణాలను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించారు.జాతరలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఇతర వ్యాపార కార్యకలాపాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని ఆర్థికంగా లాభపడ్డారు. ఈ



వ్యాపారాల కోసం రూ.6 కోట్ల పెట్టుబడిని బ్యాంకులు, జిల్లా మహిళా సమాఖ్యల ద్వారా సమకూర్చగా.. మొత్తం రూ.9.12 కోట్ల ఆదాయం లభించింది. పెట్టుబడి ఖర్చులు పోగా రూ.3 కోట్లకుపైగా లాభం వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలు అవుతున్న ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి ఇది నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకం, మహిళా సంఘాల పట్టుదల, ఆడ బిడ్డల శ్రమ ఫలితమని అభినందించారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడుతూ స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు దృఢమైన పునాది వేసిందని మంత్రి ప్రశంసించారు.

# నల్ల చట్టాలు రద్దు చేయాలంటూ కదం తొక్కిన కార్మికులు



**పర్వతగిరి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కార్మికులు పర్వతగిరి మండల కేంద్రంలో చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని తెలిపారు. సమ్మె విజయవంతానికి సమస్త కార్మిక లోకం కదిలింది. కార్మికుల గొంతుకలు ఒక్కటై నినాదాలతో హోరెత్తించారు. ఐకమత్యంతో సమ్మెను జయప్రదం చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికను పంపామన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, రైతుఆధ్వర్యంలో కార్మికులు భారీర్యాలీ చేపట్టారు. ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు మండల కన్వీనర్ జిల్లా రమేష్ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు గజ్జల మౌనిక వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మాదాసి యాకోబు కెవిపిఎస్ మండల నాయకులు పోడేటి దయాకర్ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ మండల అధ్యక్షులు నకర కంటి రామచందర్ మాట్లాడుతూకార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్‌వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, ప్రజాధనంతో నిర్మించుకున్న , రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగిస్తే సహించేది లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జిల్లా రమేష్ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల కో కన్వీనర్ జిల్లా స్వరూప, లక్ష్మీ భవాని, జ్యోతి,మంగ, సునీత, సుల్తానా, అరుణ, లలిత, వనిత ప్రేమలత సామ్రాజ్యం, శారద సుమిత్ర,రజిత, సుగుణ, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు రాపాక భాస్కర్, ఒగ్గు మల్ల రామ్ సాగర్, చీదురు రజిని బాబు, రైతుసంఘం మండల అధ్యక్షుడు బానోతు మోహన్, ఆశా కార్యకర్తలు భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీద కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు సనాతన హిందూ సేవా సమితి బాధ్యులు. చిన్న వయసులోనే భర్త చనిపోయి పిల్లల చదువులు, పోషణ భారంగా మారి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వరంగల్ లోని శివనగర్ కు చెందిన మాసని రాధిక కు గురువారం రెండు నెలలకు సరిపడా బియ్యం




మరియు నిత్యావసరాలు అందజేశారు. ఇప్పటి వరకు 160 కుటుంబాలకు సహకారం అందించినట్లు సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థులు ఏజెంట్లు నిర్ణిత సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి

**-మాజీ ఎమ్మెల్యే పెద్ది**

**నర్సంపేట టు ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్ లతో సమావేశం నిర్వహించిన మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్నా ప్రజలందరికి నా కృతజ్ఞతలు.ఈ ఎన్నికలలో విజయంకోసం పోరాటం చేసినా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు,కార్యకర్తలకు,శ్రేణులకు,నాయకులకు నా అభినందనలు,శుభాకాంక్షలు. తెలిపారు నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేశారు.ఈ ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.రేపు ఎన్నికల కౌంటింగ్ జరుగుతుంది కావున అభ్యర్థులు,ఏజెంట్లు నిర్ణిత సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి.లెక్కింపు వద్ద అభ్యర్థులు,ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల, పోలిస్ ల ఒత్తిళ్లను తట్టుకొని బి ఆర్ ఎస్ పార్టీ విజయం కోసం



పోరాటంచేసినాఅభ్యర్థులకు,పార్టీశ్రేణులకు,కార్యకర్తలకు,నాయక ులకు నా అభినందనలు శుభాకాంక్షలు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్,నియోజకవర్గ కోఆర్డినేటర్,పట్టణ పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్,మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు,మాజీ ఎంపీపీ, జిల్లా నాయకులు,30 వార్డుల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# సమ్మక్క - సారలమ్మ మహా జాతరలో మహిళా సంఘాలకు భారీ ఆదాయం

**- రూ.6 కోట్ల పెట్టుబడి పెడితే రూ.3 కోట్ల లాభం- ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి నిదర్శనం**

**- పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క**





సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర సందర్భంగా ములుగు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటుచేసిన స్టాళ్లు భారీ ఆదాయాన్ని ఆర్జించాయి.పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వం లో జిల్లాలోని 10 మండలాలను కవర్ చేస్తూ మొత్తం 565 ఆదాయ యూనిట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయగా వారు జాతర సమయంలో రూ.3 కోట్లకు పైగా ఆదాయాన్ని సంపాదించారు.మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని మేడారం జాతర ప్రాంగణంలో మహిళా సంఘాలకు అనుకూలమైనప్రదేశాల్లో షాపులను కేటాయింపజేశారు.ములుగు జిల్లాలోని పది మండలాలకు చెందిన మహిళా సమాఖ్యల ద్వారా వివిధరకాల వ్యాపార యూనిట్లు ఏర్పాట్లుచేయించి మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించారు.మంత్రి సీతక్క స్వయంగా ఈ యూనిట్లను ప్రారంభించి వారి బిజినెస్ కు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రభుత్వ ప్రోత్సాహకం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడం తో మహిళలు కూల్ డ్రింక్ సెంటర్లు,చికెన్ సెంటర్లు,ఇప్ప పువ్వు లడ్డూ స్టాళ్లు,బొంగు చికెన్,క్యాంటిన్లు,స్నాక్స్ తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించారు.మేడారం జాతరలో ఏర్పాటుచేసిన స్టాళ్లు,ఇతర వ్యాపార కార్యకలాపాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని ఆర్థికంగా లాభపడ్డారు. ఈ వ్యాపారాల కోసం రూ.6 కోట్ల పెట్టుబడిని బ్యాంకులు,జిల్లా మహిళా సమాఖ్యల ద్వారా సమకూర్చగా మొత్తం రూ. 9.12 కోట్ల ఆదాయం లభించింది.పెట్టుబడి ఖర్చులు పోగా రూ.3 కోట్లకుపైగా లాభం వచ్చింది. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోఅమలవుతున్న ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి ఇది నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ప్రభుత్వ ప్రొత్సాహకం,మహిళా సంఘాల పట్టుదల,ఆడ బిడ్డల శ్రమ ఫలితమని అభినందించారు.గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడుతూ స్వయం సమృద్ధిదిశగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణం దేశానికి ఆదర్శంగా నిలిచిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ఇందిరామహిళాశక్తి కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థికసాధికారతకు దృఢమైన పునాది వేసిందని మంత్రి ప్రశంసించారు.




# స్వామి వారిని ధర్శించుకున్న ఎలక్షన్అబ్జర్వర్

**కాళేశ్వరం ఫిబ్రవరి:12 (ప్రజా జ్యోతి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవాపూర్ మండలం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ములుగు జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్ గంగాధర్ గురువారం.స్వామి వారిని దర్శించుకున్నారు ముందుగా వారు రాజా గోపురం వద్ద రాగానే ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఘనంగా స్వాగతం



పలికారు అక్కడినుండి ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు పాలాభిషేకాలు అమ్మవారి ఆలయంలో దర్శనం అనంతరం అర్చక స్వాములు స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు వారి వెంట అధికారులు ఆలయ సిబ్బంది ఉన్నారు.

# కనకదుర్గమ్మ గుడి ప్రహరీ గోడ టైల్స్ పనులకు 1లక్ష 50 వేలరూపాయలతో పనులు

**ఫరూపాటి శ్రీనివాస్ రెడ్డి**



**రాయపర్తి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జెతురం తండా గ్రామం విద్యానగర్ తండాలో స్థానిక గ్రామస్తుల వినతి మేరకు కనకదుర్గ గుడి కి ప్రహరీ గోడ, టైల్స్ తదితర నిర్మాణ పనులు అడుగగా తక్షణమే స్పందించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక లక్ష యాభై వెయ్యిలు రూపాయలు ఖర్చు పెట్టి ప్రహరీ గోడ, టైల్స్ నిర్మాణ పనులు చేపిస్తున్న సందర్భంగా, ఈ రోజు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మాణ పనులను పరిశీలించినఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి గారు **ఈ కార్యక్రమంలో మండలపార్టీ నాయకులు గజావెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామిః**స్థానిక నాయకులు అయిన నేతవత్ మన్సుర్, నేతవత్ శ్రీధర్, నేతవత్ రాజేష్, నేతవత్ యాదయ్య, జాటోత్ బాద్రు, జాటోత్ శ్రీను, జాటోత్ రమేష్, నేతవత్ భీమ్లా, రవి, వెంకన్న, ప్రవీణ్, వెంకన్న, చిన్న వెంకన్న, సోమన్న, రాజేష్, రామోజీ, మురళి, లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ వుడ్ స్కూల్ అన్నువల్ స్పోర్ట్స్ మీట్

**ముఖ్య అతిథిగా పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు**




**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** యశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ స్కూల్లో నిర్వహించిన అన్నువల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ హసీనా బాను, అక్బర్ ఖాన్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల,పాఠశాల కరెస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్ ఉపసర్పంచ్ శ్రీజ, మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వరసిద్ధి వినాయక స్వామివారి కళ్యాణం మహోత్సవం

**వెంకటాపురం,ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని బెస్తగూడెం గ్రామంలో వేంచేసిన ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కళ్యాణ మహోత్సవం గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు బ్రాహ్మణోత్తముల మంత్రాచరణల మధ్య నయనానందకరంగా అంగరంగ వైభవంగా జరిగింది.స్వామివారి కళ్యాణం సందర్భంగా భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి పులకించారు.స్వామివారి కళ్యాణం సందర్భంగా కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో బహు బసుందరంగా అలంకరించారు.చలువ పందిళ్ళు వేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయంగా సహకరించిన దివంగతనేత బాలసాని ముత్తయ్యగారి కుమారుడు అశ్వపతి కళ్యాణం తిలకించడానికి



వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ఆయనకు పుష్పాభిషేకం చేసి గౌరవించారు.

# కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**-ఉపాధి హామీని ఎందుకు నిర్వీరం చేస్తున్నారు-రైతులకు కూలీలకు కాకుండా కార్పొ రెట్ల కోసమేన**

**-సిఐటియు రాష్ట్ర కార్యదర్శికాసు మాధవి -జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు**

**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగార రమేష్**

**పాలకుర్తి ఫిబ్రవరి12/ ప్రజా జ్యోతి /** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం నియోజకవర్గ కేంద్రంలో సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గుడివాడ చౌరస్తా నుండి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ కార్మికుల హక్కులను బలహీన పరుస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు లేబర్ కోడ్స్ అమలు ద్వారా ఉద్యోగ భద్రత తగ్గించడం, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్‌ను ప్రోత్సహించడం కాంట్రాక్ట్ విధానాన్ని విస్తరించడం, సమ్మె హక్కును పరిమితం చేయడం, యాజమాన్యానికి అధిక అధికారాలు ఇవ్వడం వంటి చర్యలు కార్మికుల జీవన భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. 8 గంటల పని దినం హక్కును కాపాడాలని, స్థిరమైన ఉద్యోగాలు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానాన్ని రద్దు చేయాలని 26 వేల రూపాయల కనీస వేతనాలు చట్టబద్ధంగా అమలు చేయాలని. ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత హామీ ఇస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ప్రమాద భీమా వంటి కనీస అవ సరాలు తీర్చాలని డిమాండ్ చేసారు హమాలి, రవాణా, నిర్మాణ, అంగన్వాడి, ఆశ, గ్రామపంచాయతీ, వేలాది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారన్నారు.ఈ కార్మిక, రైతు భారీ ఐక్యత ప్రభుత్వా నికి స్పష్టమైన సందేశం ఇస్తోందని ప్రభుత్వం




కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించు కోవాలని పోరాడి సాధించు కున్న కార్మిక చట్టాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మచ్చ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునగల రమేష్, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బసవ రామచంద్రం, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి మహమూద, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సారయ్య, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదర్, ఏవో ఐ నాయకులు సోమా అశోక్ బాబు, కొడకండ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలు పి భిక్షం, కార్యదర్శి మంగ, రజిత నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమసత్యం, రామ తార, వై ఉపేంద్ర, బత్తిని శ్రావణి, నూనె ముందల యాకన్న, సాంఘిక కర్ణాకర్, కుక్కల సోమన్న, పసలాది శోభ, కల్పన,ఉపేంద్ర,శ్రావణి, శ్రీలత సాధిత, అంబటి సోమయ్య, ఏనుగతల వెంకన్న, గంపల కుమార్, పెండ్లి భాస్కర్, మంద సంపత్, వివిధ గ్రామాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలి

**సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్**

**కొడకండ్ల, ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి) :** మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15 తేదీన మండల కేంద్రంలోని శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుపుకోవాలని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ కోరారు. గురువారం ఆలయం ముందు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసిన రేకుల షెడ్ ను పాలక వర్గ సభ్యులతో కలిసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, ప్రజల భాగస్వామ్యంతో మహా



శివరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు, భక్తులు ముందుకు రావాలని కోరారు. నూతన పాలక మండలి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా పాలక వర్గ సభ్యులు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.డి. షన్ను, కార్యదర్శి మహేష్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు నాగ దక్షిణ మూర్తి, మౌర్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**-పట్టణంలో కార్మిక వర్గం భారీ ప్రదర్శన**

**నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి**




**నర్సంపేట ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** నర్సంపేట కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నర్సంపేట పట్టణంలో బిఆర్టియు,ఏఐఫ్టు (న్యూ) ఏఐటీయూసీ సీఐటీయూ ఐఎఫ్టియు,టీయూసీ సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం యాకూబ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎఫ్టియు న్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేష్, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వరు,హమాలీ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మినారాయణ లు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్పొరేటు బహుళ జాతి యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా 4 లేబర్ కోడులను తీసుకువచ్చారని కనీస వేతనం అమలు చేయాలని,కార్మికుల హక్కుల రక్షణ కోసం ఉన్న చట్టాలను సవరణలు చేయడం సరికాదని రైతాంగం హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న విధంగా కార్మికుల కూడా ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్ ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువల లలిత కార్యదర్శి సంధ్య సిఐటియు పట్టణ కార్యదర్శి కందికొండ రాజు టీయూసీ నాయకులు రాజు ఏఐటీయూసీ నాయకులు నాగులు ఏఐఎఫ్టియు నాయకులు మంద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం సత్తయ్య మృతి తీరని లోటు

**పరు పాటి శ్రీనివాస్ రెడ్డి**

**రాయపర్తి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామంలో గురువారంఖమ్మం సత్తయ్య అనారోగ్యంతో మరణించగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించినఎన్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గజావెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి కుమార్, పార్టీ ముఖ్య నాయకులు కిషన్, నరేష్‌తదితరులు పాల్గొన్నారు.



# శివరాత్రి మహోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

**-భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు -భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**-కోటగుళ్లలో స్వామివారికి ప్రత్యేక పూజలు**

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి12:**
శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 15న కోటగుళ్లలో నిర్వహించే శివ కళ్యాణ మహోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. గురువారం ఆయన కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ఎస్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ పరిసరాలను పరిశీలించారు గోశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయం వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు (బందోబస్తు) పై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ



ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆలయ చిత్రాన్ని బహుకరించారు. ఆయన వెంట భూపాలపల్లి డి.ఎస్.పి అవిరి నేని సంపత్ రావు, గణపురం సిఐ కరుణాకర్ రావు, ఎస్ఐ రేఖ అశోక్ తదితరులు ఉన్నారు.

# శివ కళ్యాణ మహోత్సవానికి ముస్తాబవుతున్న కోటగుళ్లు

**ఈనెల 15 నుండి 17 వరకు శివరాత్రి ఉత్సవాలు**

**జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు**

**భారీ ఏర్పాట్లు చేస్తున్న కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ**

**శివ కళ్యాణ మహోత్సవానికి హాజరుకానున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర**

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి12:**
ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు మహాశివరాత్రి శివ కళ్యాణ మహోత్సవానికి ముస్తాబవుతుంది. కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా శివరాత్రి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తుంది మహాశివరాత్రికి మూడు రోజుల ఉత్సవాలు శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 15 ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు గంగాధర్, నాగరాజులు పూజా కార్యక్రమాలను ప్రారంభించనున్నారు 15 రాత్రి మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఎనిమిది గంటలకు శివ కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు అట్లూరి వెంకటలక్ష్మి నరసింహారావు పావన రాజ్యలక్ష్మి దంపతులు నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహించనున్నారు ఇదే రోజు జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు తెల్లవారు 16 ఉదయం స్వామివారికి మహా అన్నపూజ కార్యక్రమం జరగనుంది





అదేవిధంగా 17 మంగళవారం సాయంత్రం పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. హాజరుకానున్న ప్రముఖులు శివరాత్రి మహోత్సవాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు అదేవిధంగా ఆలయ పోషకులు నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పోతరాజు సాయి చైతన్య కీర్తి దంపతులు, లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ లలిత దేవి దంపతులు డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులు భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ లక్ష్మీ దంపతులు, గంగాధర తహసిల్దార్ అంబటి రజిత సురేష్ దంపతులు శివ కళ్యాణ మహోత్సవానికి హాజరు కానున్నారు.

# పాఠశాలలో స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ

**శాయంపేట ఫిబ్రవరి 12 ప్రజాజ్యోతి:**
మండలంలోని పత్తిపాక జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు చిట్టి రెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి జ్ఞాపకార్థం సతీమణి చిట్టి రెడ్డి భాగ్యలక్ష్మి కుమారుడు చరణ్ రెడ్డి కుమార్తె సీమా రెడ్డి 20 వేల విలువగల స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. అదేవిధంగా 2025లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి 15 వందల రూపాయలు చొప్పున బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ఆఫీసర్ భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి భవిష్యత్తులో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ బిక్షపతి స్కూల్ హెడ్ మాస్టర్ మాధవి ప్రైమరీ




హెడ్మాస్టర్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు విజయ్ రఘు రమాదేవి విజయ్ కుమార్ సర్పంచ్ ఐలయ్య 8వ వార్డు మెంబర్ గడ్డమీది హారతి కరుణాకర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్తు సవరణ చట్టం వద్దు

**కేటీపీపీ ఉద్యోగుల ఆందోళన**

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి12:** కేంద్రం తీసుకురానున్న విద్యుత్తు




సవరణ చట్టం-2025పై కేటీపీపీ ఉద్యోగులు మండిపడ్డారు. గురువారం చెల్పూర్ లోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచే నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఉద్యోగులు, మధ్యాహ్నం ప్లాంట్ గేటు ముందు ధర్నాకు దిగారు. ?కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని చూడటం దుర్మార్గమని నాయకులు విమర్శించారు. దీనివల్ల సామాన్య వినియోగదారులకు కరెంట్ కష్టాలు మొదలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు, వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిపియుఎస్ క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ



**ములుగు ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):**
ములుగు జిల్లా కేంద్రంలోని డిఈఓ కార్యాలయంలో ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థరెడ్డి చేతులమీదుగా టిపియుఎస్ జిల్లా క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి,జనరల్ సెక్రెటరీ గోనే రవీందర్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సల్లగొండ పద్మాకర్ రెడ్డి,టిపియుఎస్ క్రియాశీల సభ్యుడు రాజిరెడ్డి,బాణాల సుధాకర్,ఎడ్ల సంపత్,ఆర్ కృష్ణమూర్తి,గొల్ల కుమార్, ఉల్లాల రాజేందర్,శ్యామ్, సిఆర్పీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జల్లి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం

**చెన్నారావుపేట ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):**
చెన్నారావుపేట మండలం జల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో 3 సంవత్సరాలు నిండిన చిన్నారులకు శు క్రవారం అంగన్వాడి టీచర్లు కృష్ణవేణి రజిత ఆధ్వర్యంలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి (ఎంఈఓ) బైరి సరళ, ఉప సర్పంచ్ మేరుగు బాబు ముఖ్య అతిథులుగా హాజరై, చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జల్లి యుపిఎస్ స్కూల్ హెడ్ మాస్టర్ ఈర్య,పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ ఆయాలు,చిన్నారుల తల్లులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

